# మిసెస్ పరాంకుశం

## మల్లాది వెంకట కృష్ణమూర్తి



*1971 లో మల్లాది గారి కలం నుంచీ వెలువడిన రెండవ నవల*

*(క్రిందటి సంచిక నుంచీ కొనసాగింపు)*

12

**పరాంకుశం దంపతులు** ఏలూరు నుంచి అనకాపల్లికి వెళ్ళారు. కొత్త ఉద్యోగంలో చేరిన ఏడెనిమిది నెలలదాకా వాళ్ళ పాత చరిత్ర ఎవరికీ తెలీదు కాబట్టి వాళ్ళ ప్రాణానికి శాంతిగా ఉంది. ఏలూరులో లాగా సౌదామిని బయటికి వెళ్ళినప్పుడల్లా ఆమె వంక ఆసక్తిగా గుచ్చి గుచ్చి చూసే చూపులు వచ్చి ఇప్పుడు సౌదామినిని తగలడం లేదు. పరాంకుశాన్ని చూసి గుసగుసలాడుకునే మనుషులు కూడా వాళ్ళకి తారసపడటం లేదు.

"నాకీ ఊళ్ళో హాయిగా ఉందండి."

సౌదామిని చెప్పింది ఆరు నెలల తర్వాత.

"దేనికి హాయి"

అడిగాడు పరాంకుశం.

కారణం వినిపించింది.

"అవును. నాక్కూడా ఆ విషయంలో బావుంది. ఎలాంటి గుర్తింపు లేకుండా మిగిలిన వాళ్ళల్లా మన బ్రతుకులని మనం వెళ్ళదీస్తున్నాం."

ఐతే వాళ్ళ జీవితంలోని ఈ ప్రశాంతత వాళ్ళకి ఎక్కువ కాలం దక్కలేదు.

ఓ ఆదివారం రాత్రి వాళ్ళింటి తలుపు ఎవరో తట్టారు. సౌదామిని పిల్లకి పాలు పడుతోంది. పరాంకుశం వెళ్ళి తలుపు తీశాడు. ఎదురుగా ఓ అపరిచిత వ్యక్తి నిలబడి ఉన్నాడు. గుప్పున బ్రాంది వాసన.

"ఎవరు కావాలి?"

అడిగాడు పరాంకుశం.

"సౌదామిని. ఇంకా వ్యాపారంలోనే ఉందటగా?"

పరాంకుశం మొహం కోపంతో ఎర్రబడింది.

"ఎవరు నువ్వు?"

"నా పేరు సింగినాదం, జీలకర్ర. ఏదైతే ఏమిటి? ఇప్పుడు రేటెంత?"

అతన్ని కొట్టబోయి చెయ్యెత్తాడు పరాంకుశం. వెనక నుంచి వచ్చిన సౌదామిని అతని చేతిని పట్టుకుని ఆపింది.

"నాకు పెళ్ళయింది. నేనావృత్తి మానేసి చాలాకాలం అయింది. మీరెవరో నాకు తెలీదు కాని, మా అడ్రసు ఎవరు చెప్పారు?" శాంతంగా అడిగింది.

"ఎలమంద."

"ఎలమంద ఈ ఊళ్ళో ఉన్నాడా?"

"అవును. నిజంగానే మానేసావా? లేక అబద్ధం చెబుతున్నావా?"

పరాంకుశం వంక అనుమానంగా చూస్తూ అడిగాడు.

"ఒక్క నిమిషం."

సౌదామిని లోపలికి వెళ్ళింది. పరాంకుశం అతని వంక మింగేసేలా చూసాడు.

సౌదామిని కొద్ది క్షణాల్లో ఓ దినపత్రికని, ఓ వార పత్రికని తీసుకు వచ్చి అతనికి అందించి చెప్పింది.

"ఇదివరకు మీరు దీన్ని చదివితే గుర్తుకు వస్తుంది. లేదా ఇప్పుడు అర్ధమవుతుంది."

అతను ఆ రెంటిని చకచక చదివాక అతని మొహంలో మార్పు వచ్చింది. కొద్దిగా తత్తర పడ్డాడు.

"ఓ! సారి. ఐ యాం సారి."

"ఇట్స్ ఓకే. ఎలమందతో చెప్పండి ఈ సంగతి."

"అలాగే"

వాటిని తిరిగి ఇచ్చి చటుక్కున వెనక్కి తిరిగి అతను వెళ్ళిపోయాడు.

"ఎలమంద ఎవరు? ఆ పేపరేమిటి? నాకు అర్ధంకాలేదు."

అడిగాడు పరాంకుశం.

"ఎలమందంటే, ఆ సందులో ఆ ఇంటిలో ఉండే కుంటివాడు."

"వాడా! వాడు మళ్ళీ నిన్ను కలిసాడా?"

ఆశ్చర్యంగా అడిగాడు పరాంకుశం.

"లేదు."

భార్య ఇచ్చిన ఆ పేపర్లని చదివాడు. ఒకటి వారి వివాహం అయిన వార్త వచ్చిన దిన పత్రిక. రెండోది ఆ తర్వాత వారిని కలిసి ఇంటర్వ్యూ చేసి ప్రచురించిన ఓ మహిళా మాసపత్రిక.

మరో రెండు రోజుల తర్వాత మళ్ళీ పరాంకుశం ఇంట్లో లేనప్పుడు ఎవరో కొత్త వ్యక్తి తలుపు తట్టాడు.

"నన్ను గుర్తుపట్టావా?"

వెకిలిగా నవ్వుతూ అడిగాడు సౌదామినిని.

"లేదు"

" 'మని'కోసమే నువ్వు ఈ వృత్తి చేస్తావు కాబట్టి నిన్ను సౌదా'మని' అని పిలిచేవాడిని. నా పేరు..."

"నేనా వృత్తి మానేసి చాలాకాలం ఐంది. పెళ్ళికూడా చేసుకున్నాను."

"గుట్టుగా చేసుకుంటున్నావటగా? ఎవరికీ చెప్పనులే. రాత్రికి రానా?" అడిగాడతను.

"నేను చెప్పింది నిజం. ఆ వృత్తి మానేసాను." శాంతంగా జవాబు చెప్పింది సౌదామిని.

"ఐతే ఇంకా మంచిది. రేటు పెంచి ఉంటావు."

ఓ అడుగు ముందుకు వేసాడు.

"అమ్మా!" అంటూ ఆరేళ్ళ శ్రావణి వచ్చింది.

ఆ పిల్లని చూడగానే అతను ఓ అడుగు వెనక్కి వేసాడు. అతని మనసు మారిపోయింది.

"నువ్వు చెప్పేది నిజమే అయితే వెళుతున్నాను."

"నిజమే"

"మంచి పని చేసావు సౌదా"

వెనక్కి తిరిగిన అతన్ని అడిగింది సౌదామిని.

"ఈ అడ్రసు ఎవరు చెప్పారు?"

"కుంటి ఎలమంద."

"ఎక్కడుంటాడు వాడు?"

"సాయంత్రం సారథి బార్ బయట ఉంటాడు. బార్‌లో తాగేవాళ్ళందరకీ వాడు బ్రోకర్ అని తెలుసు."

"నేనీ వృత్తిని మానేసానని దయచేసి వాడికి చెప్పండి."

"తప్పకుండా. వాడు పంపితే నిజమని ధైర్యంగా వచ్చాను."

"ఎవరమ్మా ఆయన?" అడిగింది శ్రావణి.

"ఇంకో చోటకి వెళ్ళబోయి తప్పు అడ్రసుకి వచ్చాడు."

భర్త ఇంటికి రాగానే సౌదామిని ముందు అతనికి కాఫీ ఇచ్చింది. తర్వాత ఏడుంపావుకి వచ్చే ఇంగ్లీష్ వార్తలని షార్ట్‌హేండ్‌లో రాస్తూ ప్రాక్టీస్ చేసుకున్నాక ఇందాక జరిగింది చెప్పింది.

"నువ్వెళ్ళి ఎలమందతో నేనా పని మానేసానని చెప్పిరా."

"అలాగే. మొన్న వాడు వచ్చినప్పటినుంచి నా మనసులో కొద్దిగా అనుమానం తొలుస్తోంది."

"పిచ్చివాడా! ఎప్పుడూ అలాంటి అనుమానలు పెట్టుకోక. ఇక ఈ జన్మలో ఆ పాడు పని చేయను."

అతని నుదుటిమీద జుట్టులోకి వేళ్ళు పోనిచ్చి నవ్వుతూ చెప్పింది సౌదామిని.

✷✷✷

"మా ఇంటికి విటుల్ని పంపిస్తున్నావు?" అడిగాడు పరాంకుశం ఎలమందని.

"రెండు కారణాలు. ఒకటి నాకు సౌదామిని తాలూకు డబ్బు పూర్తిగా ముట్టలేదు. వడ్డీ అక్కర్లేదు. మిగిలిన నాలుగు వేలు ఇస్తే పంపను."

"ఇంకో కారణం?"

"నన్ను కొందరు కష్టమర్స్ పిలిచి ఓ పెగ్ ఇప్పించి అమ్మాయిలని అరేంజ్ చేయమని కోరతారు. కుదరనప్పుడు మీ ఇంటి ఎడ్రస్ చెప్పి పంపుతూంటాను."

"అసలు మా ఇల్లు నీకు ఎలా తెలుసు?"

"ఓ సారి నువ్వు సైకిల్ మీద వెళుతూ కనిపించావు. నీ వెంటే వచ్చి నీ ఇల్లు చూసాను. అప్పుడే కూరలు కొనడానికి బయటకి వచ్చిన సౌదామినిని చూసాను. అదింకా నీ దగ్గరే ఉందని తెలిసింది."

"ఇంకెవర్నీ పంపక. సౌదామినికి, నాకు పెళ్ళయ్యాక ఆ వృత్తి మానేసింది."

"నాలుగువేలు ఇస్తే ఎవర్నీ పంపను. లేదా పంపుతూంటాను."

"ఇంకోసారి ఎవర్నయినా పంపితే నీకు ఉంటుంది చూడు."

బెదిరించాడు పరాంకుశం.

"నా కేమైనా అయితే నీకు ఉంటుంది చూడు. ఈ ఊళ్ళోని రౌడీలంతా నా ఫ్రండ్సే."

ఇంటికి వచ్చి భార్యతో చెప్పాడు. ఇల్లు మారడం ఉత్తమం అనుకున్నారు. మంచివాళ్ళకి దేవుడు మేలు చేస్తాడు అన్నట్లుగా మర్నాడే జరిగిందా సంఘటన.

✷✷✷

శ్రావణిని స్కూలు నుంచి మధ్యలో రిక్షాలో ఇంటికి పంపించేసారు స్కూలు వాళ్ళు. శ్రావణి ఒళ్ళు కాలిపోతోంది. ముక్కు తెగ కారుతోంది. ఒంటి మీద ఎర్రటి దద్దుర్లు. వెంటనే సౌదామిని భయంగా కూతుర్ని ప్రభుత్వ హాస్పిటల్ కి తీసుకువెళ్ళింది.

డాక్టరు శ్రావణిని పరీక్షించి మీజిల్స్ వచ్చాయని, ఏంటీ బయోటిక్స్ రాసిచ్చాడు.

బయటకి వస్తుంటే మస్తానమ్మ సౌదామిని గుర్తుపట్టి పలకరించింది. ఆమె ఎలమంద భార్య. ఏడుస్తోంది.

"ఏమైంది?" అడిగింది సౌదామిని.

"మా కుంటాడు పీకలదాకా తాగి రాత్రి రోడ్డు దాటుతుంటే ఏక్సిడెంటైంది. రెండు సీసాల రక్తం ఎక్కించారు. ఇంకా తీసుకురమ్మన్నారు కాని నా దగ్గర డబ్బులేదు. నీకాడ ఉంటే ఇస్తావా?"

ఆమె దగ్గర డబ్బులేదు. సౌదామిని తన రక్తాన్ని ఇవ్వడానికి సిద్ధపడింది. ఆమె రక్తం ఎలమందకి మేచ్ కాలేదు కాని, సౌదామిని ఇచ్చే రక్తానికి బదులుగా అతని బ్లడ్ గ్రూప్ రక్తం ఎక్కించడానికి డాక్టర్ ఒప్పుకున్నాడు. అరగంటలో రక్తదానం చేసింది సౌదామిని.

ఎలమంద చాలాసార్లు పరాంకుశానికి కనిపించాడు. కాని ఆ తర్వాత వాళ్ళింటికి ఎలమంద పంపించాడంటూ ఎవరూ రాలేదు.

✷✷✷

పదిహేను సంవత్సరాల కాలం అంత పెద్ద లెక్కలోది కాదు. కొత్త కాలంతో పాటు కొత్త సమస్యలు వస్తూనే ఉంటాయి. వాటిలో చాలా మటుకు పరిష్కరించుకోవచ్చు. కొన్నింటిని పరిష్కరించుకోవడం అంత తేలికకాదు. ఆ కొన్నిటిలో ముఖ్యమయినది శార్వరి.

ఏభై ఆరేళ్ళ పరాంకుశం కూతురు శార్వరికి ఇరవై ఏడేళ్ళు నిండుతునాయి వారికి శార్వరితో పాటు ఇంకో కూతురు, కొడుకు ఉన్నారు.

శార్వరికి పెళ్ళి వయసు వచ్చినప్పటినుంచీ సంబంధాలు చూస్తున్నాడు పరాంకుశం. నాయుడుతో స్నేహం పోలేదు పరాంకుశానికి. ఇంకా చేతనైన సహాయం చేస్తున్నాడు. అనేక పెళ్ళి సంబంధాలు తీసుకువచ్చాడు.

కాని, ఏ ఒక్కటీ కుదరలేదు. సంప్రదాయం కావాలట. వ్యభిచారి కూతురిని చేసుకోరట. పెళ్ళాం కాపురం చేసుకునేందుకు కావాలట. డబ్బు సంపాదించి పెట్టేందుకు కాదట. శార్వరి లాంటి 'తునకలు' కావాలంటే వందరూపాయల్లో సంపాదించుకోగలరట.

ఇంకా ఇలా చాలా ఆ కుటుంబం చెవిని పడ్డాయి. అందరూ తమ దుస్థితికి బాధాడుతున్నారు.

"అమ్మా! నన్నెందుకు కన్నావమ్మా?" అడిగింది శార్వరి ఓ రోజు.

"శార్వరి ఏమందో విన్నారా? మీరు నన్ను ఆ పాపకూపంలోనే ఉంచేయవలసింది" కూతురన్న మాటలు చెప్పి, సౌదామిని పరాంకుశంతో బాధగా అన్నది.

"ఛీ! పాడు లోకం ఇంకా పాడైంది. అది ఎంత నిప్పులాంటిదో ఎవరికీ అర్థంకాదు." అనుకున్నాడు పరాంకుశం.

"ఆనాడు ఎన్నో సమస్యలకి పరిష్కారం దొరికింది సౌదామిని. ఇప్పుడు ఏ దిక్కూ తోచడం లేదు. అంత మాటన్నాక ఇక శార్వరి మొహం చూడటానికే నాకు సిగ్గుగా ఉంది." బాధపడుతూ పరాంకుశం చెప్పాడు.

"మీరిదవకండి." ఓదార్చింది భర్తని.

"చెడు అందరిలోనూ ఉంది. ఆ సంగతి అనుభవపూర్వకంగా నేను గ్రహించాను. అమ్మాజీని ఎవరో మోసం చేయలా? వాడు మంచివాడా? అమ్మాజీ ఇంటి ఎదురుగా ఉన్న అనుమానపు మొగుడు మంచివాడయితే అతని భార్య లేచిపోయేదా? చెప్పు సౌదామినీ! ఆ గాంధీ బొమ్మ బహుమతి ఇచ్చిన ఆవిడ మంచిదా? ఎంతమందికి తన శరీరాన్ని అర్పించి ఉంటుందో? మామయ్య చావుకి దగ్గరైనప్పుడు ఆయనకి నువ్వు సేవ చేస్తుంటే నీ నుంచి సుఖం కోరిన నా అత్తయ్య చెల్లెలి కొడుకు మంచివాడా? ఇలా చెప్పుకుంటూ పోతే చాలామందే ఉన్నారు. వాళ్ళంతా మంచివాళ్ళా? వాళ్ళలో లేని చెడ్డతనం నీలో, నాలో, శార్వరిలో ఎక్కడ ఉంది? ఎక్కడనుంచి వచ్చింది?" సౌదామినితో బాధగా అంటాడు పరాంకుశం.

"ఊరుకో, బాధపడకు. మంచివాళ్ళెవరో దొరక్కపోరు. దానికి దేవుడు ఎవర్నో ఒకర్ని రాసిపెట్టే ఉంటాడు. సాధారణంగా ఎవర్నీ ఒంటరిగా పంపడు ఈ లోకంలోకి."

"దేవుడు మరచిపోయాడు సౌదామినీ, మనలాంటి వాళ్ళ సంగతి పూర్తిగా మరిచిపోయాడు."

"ఎందుకు ఇంత అధైర్యపడతారు? ఆ రోజుల్లో ఎంత ధైర్యంగా ఉండేవాళ్ళు?"

"ఆ ధైర్యం వయస్సుతోనే పోయింది. ఆ నాటిలా ఈ సమస్య వ్యక్తిగతంగా పూర్తిగా నాది కాదుకదా."

✷✷✷

ఓ రోజు ఎవరో డోర్‌బెల్‌ని కొట్టారు. శార్వరి చెల్లెలు శ్రావణి వెళ్ళి తలుపు తెరిచింది. పూర్తిగా బట్టతల వచ్చిన ఓ కొత్త వ్యక్తి నిలబడి ఉన్నాడు.

"ఎవరు కావాలి?" ప్రశ్నించింది శ్రావణి.

"నీ పేరు శార్వరా, శ్రావణా లేక శారదా?" నవ్వుతూ అడుగుతున్న అతనికి శ్రావణి తన పేరు చెప్పి పక్కకి జరిగి మర్యాదగా చెప్పింది.

"లోపలికి రండి."

అతను లోపలికి వచ్చి నవ్వుతూ చెప్పాడు.

"నీకు నాలుగేళ్ళప్పుడు చూసాను. మళ్ళీ మీ నాన్నని కలవలేదు. నేను మీ నాన్న స్నేహితుడిని. ఉన్నాడా పరాంకుశం?"

"కూర్చోండి. పిలుస్తాను."

కొద్ది క్షణాల్లో ముందు గదిలోకి వచ్చిన పరాంకుశం ఆ వ్యక్తిని కొద్దిసేపు తేరిపార చూసి గుర్తుపట్టి ఆనందంగా చెప్పాడు.

"శ్రీకంఠం! ఎంత మారిపోయావురా?"

"నువ్వు మాత్రం! ఆ తెల్ల జుట్టేంటి?" శ్రీకంఠం ఆప్యాయంగా పరాంకుశం భుజం చుట్టూ చేతిని వేసి అడిగాడు.

"సౌదా! ఎవరొచ్చారో చూడు." లోపలికి వినపడేలా గట్టిగా అరిచి చెప్పాడు పరాంకుశం.

కొద్ది క్షణాల్లో ముందు గదిలోకి వచ్చిన సౌదామిని శ్రీకంఠాన్ని భర్తకన్నా త్వరగా గుర్తుపట్టింది.

"ఎలా ఉన్నారు? మీ ఆవిడ జానకి ఎలా ఉంది? ఇద్దరు కొడుకులు కదా? పేర్లు గుర్తులేవు." అడిగింది సౌదామిని.

"అవును. రాధాకృష్ణ, రాజ్‌కృష్ణ, మా జానకి కృష్ణ భక్తురాలు."

"నువ్వింకా రాంచీలోనే ఉన్నావా?"

"అవును. వచ్చే సంవత్సరం రిటైరవుతున్నాను. మీ పిల్లల పెళ్ళిళ్ళు అయ్యాయా?"

"నీకు శుభలేఖ పంపకుండానే? ఇంకా లేదు. మీ పిల్లలవి?"

అడిగాడు పరాంకుశం.

"రాధాకృష్ణ పెళ్ళికనుకుంటా మనకి శుభలేఖ వచ్చింది. రెండేళ్ళవలా?" సౌదామిని శ్రీకంఠాన్ని అడిగింది.

"కాదు. రాజ్ కృష్ణది. వాడిది ప్రేమ వివాహం. అన్నది కాకుండానే ఓ బెంగాలి అమ్మాయిని చేసేసుకున్నాడు. ఇప్పుడు రాధాకృష్ణ పెళ్ళి కుదిరింది. దానికి పిలవడానికే వచ్చాను."

చేతి సంచి లోంచి మిష్టర్ అండ్ మిసెస్ పరాంకుశం అని రాసి ఉన్న ఓ కవరుని అందించాడు. దానికి నాలుగు మూలలా పసుపు రాసి ఉంది.

"కులం గోత్రంలాంటివేం అడక్కండి. ఇది కూడా ప్రేమ వివాహమే. బీహారీ అమ్మాయి. హిందువైనందుకు సంతోషిస్తున్నాం." నవ్వుతూ చెప్పాడు శ్రీకంఠం.

"ఎవరైతే ఏముంది. మనిషి మంచిదైతే చాలు. సౌదామిని కులం, గోత్రం, మతం ఎవరికి తెలుసు?"

కొద్దిసేపు మిత్రులు ఇద్దరూ పాత విషయాలు మాట్లాడుకుంటుంటే, పరాంకుశం పిల్లలు ముగ్గురూ అవి ఆసక్తిగా విన్నారు. మర్నాడు భోజనానికి రమ్మని ఆహ్వానించింది సౌదామిని.

✷✷✷

ఓ రోజు ఓ కొత్త వ్యక్తి తలుపు తోసుకుని లోపలికి వచ్చాడు. గుమ్మం దగ్గరే ఆగి పరాంకుశాన్ని, సౌదామిని చూసాడు.

"ఎవరు కావాలి బాబూ?" అడిగింది సౌదామిని.

వాళ్ళిద్దరూ శార్వరిపెళ్ళి గురించి ఓ మేరేజ్ బ్యూరోకి వెళ్ళిరావడానికి తయారై బయలుదేరబోతున్నారు.

"పరాంకుశంగారు మీరేనా?"

అడిగాడు అతను

"నేనే. రా బాబూ, రా. కూర్చో," కళ్ళజోడు సర్దుకుని ఆహ్వానించాడు పరాంకుశం.

"నమస్తే.. మీ పెద్దమ్మాయి.. మా అమ్మాయి చెప్పింది."

అతను కొద్దిగా తడబడుతూ చెప్పాడు.

"ఏమీటి? నాకు అర్థంకాలేదు."

అడిగాడు పరాంకుశం.

ఏం మాట్లాడాలో తెలియక తబ్బిబ్బుపడుతూ అలాగే నించుండిపోయాడు అతను.

"ముందు కూర్చో" నవ్వుతూ చెప్పింది సౌదామిని.

అతను ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చున్నాడు. అతని వంక దంపతులు ఇద్దరూ చూస్తున్నారు.

"శార్వరి మీ పెద్దమ్మాయి కదా?"

కొద్దిక్షణాలాగి అడిగాడు. ఆ యువకుడు.

"అవును."

"మీ అమ్మాయిని వివాహం చేసుకోవాలని అనుకుంటున్నాను నేను."

ఆశ్చర్యం, సంతోషం ముప్పిరిగొన్నాయి ఆ ఇద్దరినీ.

"నీకు మా వివరాలన్నీ తెలుసా?" అడిగాడు పరాంకుశం అనుమానంగా.

"అమ్మ చెప్పింది."

"సౌదామిని గురించి?"

"తెలుసు. మీరు మీ మామయ్య మాటని కూడా ఖాతరు చేయకుండా సౌదామినిని రిజిస్టర్ మేరేజ్ చేసుకున్న విషయం మొత్తం మా అమ్మ నాకు చెప్పింది.""

"అయినా శార్వరిని పెళ్ళిచేసుకోవడానికి సిద్ధంగా ఉన్నావా?"

"అవును."

"అన్నీ ఆలోచించుకున్నావా? అదంత మంచి ముందంజ కాదేమో?"

ప్రశ్నించాడు పరాంకుశం.

"మీరు సౌదామినిగారిని ఎందుకు చేసుకున్నారో అందుకే? కాని, మీరు చేసినంత సాహసం చెయ్యడంలేదు నేను. ఐ కాంట్ అప్ లిఫ్ట్ ఎ కాల్ గర్ల్. నాలో మీలో ఉన్నంత సాహసం లేదు. అందుకే పెళ్ళి సమస్యని ఎదుర్కొంటున్న శార్వరిని ఎన్నుకున్నాను."

"ఇంతకీ మా అమ్మాయిని చూసావా?" అడిగింది సౌదామిని.

"ఇంకా లేదు. కాని, ఫోటో చూసాను. ఇష్టపడ్డాను."

అతను కొన్ని క్షణాలు ఆ దంపతుల వంక పరిశీలనగా చూసాడు.

"పార్వతీ పరమేశ్వరులలాగా ఉన్నారు మీరిద్దరు." చెప్పాడు.

"సౌదామినీ పరాంకుశంలాగా ఉన్నాము. అంతే. అవునా?" చెప్పాడు పరంకుశం నవ్వి, సౌదామిని కళ్ళలోకి చూస్తూ.

సిగ్గుతో తల వంచుకుంది సౌదామిని.

"నేను మళ్ళీ వస్తాను. అమ్మ వచ్చి మీతో మాట్లాడుతుంది."

"కాఫీ తీసుకు వెళుదువుగాని."

అతనికి శార్వరి కాఫీ తెచ్చిచ్చింది. తన కూతుర్ని పరిచయం చేసాడు పరాంకుశం.

"నమస్తే." చెప్పింది శార్వరి.

"నమస్తే." అతను జవాబుగా ప్రతి నమస్కారం చేసాడు.

"ఎవరు నువ్వు?నీ పేరు చెప్పనే లేదు? కాని నిన్ను ఎక్కడో చూసినట్లుగా ఉంది?" అడిగాడు పరాంకుశం,

"నన్ను చూడలేదు, మీరు మా అమ్మని చూసారు."

"ఎవరు మీ అమ్మ?"

"అమ్మాజీ."

"ఓ!"

దంపతులు ఇద్దరి మొహాల్లో ఆశ్చర్యం తొంగిచూసింది.

"ఎలా ఉంది అమ్మాజి?" వెంటనే అడిగింది సౌదామిని.

"బావుంది."

"ఎక్కడ మీరుండేది? రాయలసీమలో కదా?"

"అవును. తాడిపత్రిలో ఉండేవాళ్ళం. ఇప్పుడు బెంగుళూరులో ఉంటున్నాం. నాకు అక్కడ ఉద్యోగం వచ్చింది." చెప్పాడు అతను.

"నువ్వు మీ అమ్మ కడుపులో ఉండగా మీ అమ్మని ఓసారి ఎక్కడో చూసిన గుర్తు" చెప్పింది సౌదామిని.

"అవును. నాకు గుర్తుంది. సినిమా హాలులో"

అమాయకం నటిస్తూ చెప్పాడు అతను. ఫక్కున నవ్వి చెప్పింది సౌదామిని.

"మంచివాడివే."

"నువ్వు చెప్పనే లేదు. మీ నాన్నగారు ఏం చేస్తున్నారు? ఇంతకీ నీ పేరు?" అడిగాడు పరాంకుశం.

"మా నాన్నగారి పేరు జంబులింగం. ఆయన స్క్రేప్ బిజినెస్ చేస్తున్నారు నా పేరు సూర్యారావు నేనక్కడ ఇంజనీరింగ్ కాలేజ్‌లో లెక్చరర్ గా పనిచేస్తున్నాను. తమ్ముడు చంద్ర డాక్టర్ చదువుతున్నాడు. చెల్లెలు నిశిగంధ టెన్త్ చదువుతోంది."

"సూర్యారావంటే మీ తాతగారి పేరే పెట్టారన్నమాట. నేను వారింట్లో బ్రహ్మచారిగా ఉండగా అద్దెకుండేవాడిని." చెప్పాడు పరాంకుశం.

"అవును. ఏలూరులో. అమ్మ అప్పుడప్పుడు మీ గురించి చెపుతుంటుంది"

మిగిలిన ఇద్దరు పిల్లలని పిలిచి పరిచయం చేసారు. కాఫీతాగాక అతను చెప్పాడు.

"శార్వరికి వివాహం విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని మీ బావగారు మా నాన్నగారికి చెప్పారుట. అందుకని మా అమ్మ శార్వరిని చూసి రమ్మంది. మీతో సంబంధం కలుపుకోవాలని మా అమ్మకి బాగా కోరిక."

"సంతోషం." చెప్పింది సౌదామిని.

ఎడ్యుకేషనల్ టూర్ మీద విద్యార్థులతో వచ్చిన అతను తమ ఇంటి చిరునామా, ఫోన్ నంబర్లు రాసిన కాగితాన్ని ఇచ్చి వెళ్ళిపోయాడు.

అతనెళ్ళాక సౌదామిని నవ్వుతూ చెప్పింది.

"మీరు మొదటిసారి 'నన్ను పెళ్ళిచేసుకుంటావా?' అని అడిగినప్పుడు కూడా ఇలాగే తడబడ్డారు గుర్తుందా? అప్పుడు మీలోనూ ఇంత ఉత్సాహం ఉంది."

"అవును. ప్రతి తరంలోనూ ఒక్కడయినా ముందడుగు వేద్దామనే ఉత్సాహంతో ఉంటాడు, ఫర్వాలేదు."

"నౌ ఆర్ యు హాపీ, మిస్టర్ పరాంకుశం?" నవ్వుతూ అడిగింది సౌదామిని.

"ఎస్, మిసెస్ పరాంకుశం!" నవ్వాడు పరాంకుశం.

* * *

(అయిపోయింది)




ఈ నవల క్రిందటి భాగాలు ఇంకా చదవలేదా..? లేక మళ్ళీ ఒకసారి చదువుదామనుకుంటున్నారా? వెంటనే కౌముది గ్రంథాలయాన్ని సందర్శించండి..

**Click here to go to KOUMUDI Library**